సాక్షి
మంచిర్యాల
గురువారం । 11 । జూలై । 2024



ప్రభం'జనం'
నానాటికీ జనాభా పెరిగిపోతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30లక్షలకు చేరువగా ఉన్నట్లు తెలుస్తోంది. నేడు ప్రపంచ జనాభా దినోత్సవం సదర్భంగా ప్రత్యేక కథనం. 8లో▸

గ్రూప్–1 మెయిన్స్‌కు ఉచిత శిక్షణ
మంచిర్యాలటౌన్: గ్రూప్–1 మెయిన్స్ కోసం మైనారిటీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ తరగతులు ఈ నెల 22నుంచి ప్రారంభమవుతాయని, ఈ నెల 19లోగా దరఖాస్తు సమర్పించాలని, వివరాలకు 040-23236112, directormscccctelangana@gmail.comలో సంప్రదించవచ్చని తెలిపారు.

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
33.0 /27.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

విద్యార్థులను ప్రోత్సహించాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలోని ప్రతీ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు నామినేషన్లు ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు పంపించి జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుతో కలిసి ఇన్‌స్పైర్ మనక్ అవార్డు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టి వారిలోని వినూత్న ఆలోచనలతో ప్రజోపయోగకర నూతన ఆవిష్కరణలకు ఇన్‌స్పైర్ మనక్ అవార్డ్స్ వేదికగా పని చేస్తుందని తెలిపారు.

పోలీస్‌స్టేషన్లను సందర్శించిన డీసీపీ



కాసిపేటలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ

కాసిపేట: మండలంలోని కాసిపేట, దేవాపూర్ పోలీస్‌స్టేషన్లను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ బుధవారం సందర్శించారు. పరిసరాలు పరిశీలించి, పోలీస్ సిబ్బంది వివరాలు, గ్రామాల్లో నేరాల తీరుపై అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారికి నమ్మకం కలిగించాలని, ఫ్రెండ్లీ పోలీసు అమలు చేస్తూ గ్రామాల్లో ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూనే యువతకు అవగాహన కల్పించి చెడుదారుల వైపు వెళ్లకుండా కాపాడడం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా ఆయా పోలీసుస్టేషన్లలో మొక్కలు నాటి వాటిని కాపాడాలని సిబ్బందికి సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల వేతనాలు పెంచాలి



ధర్నాలో అంగన్‌వాడీలు, ఆశాలు

బెల్లంపల్లి: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, స్కీమ్ వర్కర్ల వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు భానుమతి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క డిమాండ్ చేశారు. బుధవారం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన, ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024–25 బడ్జెట్‌లో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు బడ్జెట్ కేటాయించాలని అన్నారు. ఏళ్ల తరబడి నుంచి విధులు నిర్వహిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ క్రీడా మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్డీవో కార్యాలయ డీఏఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణ, జిల్లా నాయకులు చల్లూరి దేవదాస్, అనురాధ, భాగ్యలక్ష్మి, వీరోనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారులు

జన్నారం: మండలంలోని మొర్రిగూడ రాఘవేంద్ర రైస్‌మిల్లుల్లో పెద్దపల్లి జిల్లా సివిల్ సప్లయి అధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. బియ్యం, వడ్ల నిల్వ వివరాలు పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విజిలెన్స్ బృందంతోపాటు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్మోహన్ పాల్గొన్నారు.

భట్టి వస్తున్నారు..





హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు

- ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు..
- గతంలో 'పీపుల్స్‌మార్చ్' ఇక్కడి నుంచే
- గిరిజన సమస్యలపై విక్రమార్కకు అవగాహన
- నేడు ఉట్నూర్‌కు మంత్రివర్గ ఉపసంఘం
- 'రైతు భరోసా' వర్క్‌షాప్‌నకు హాజరు
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా రైతులు

సాక్షి,ఆదిలాబాద్: సరిగ్గా పదహారు నెలల క్రితం.. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో తన పాదయాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభించారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం వద్ద 2023 మార్చి 16న షురూ చేశారు. సుమారు నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో కొనసాగింది. పలు నియోజకవర్గాలను దాటుకుంటూ ఏప్రిల్ 13న మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో సత్యాగ్రహ సభ నిర్వహణతో ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర ముగిసింది. ఈ క్రమంలో ఆయా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఆయనను కలిసేందుకు ఆసక్తి చూపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు తగ్గట్లే మల్లు భట్టి విక్రమార్క 'వచ్చేది ప్రజా ప్రభుత్వమేనని, ఇందిరమ్మ రాజ్యంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని' ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ విషయం ఇప్పుడు ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. పాదయాత్ర అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా భట్టి కీలక బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాకను ఈ ప్రాంతవాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

ఆర్థికమంత్రిగా వరాలు కురిపించాలని..

నాడు పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లాలో ప్రజలను కలిసినప్పుడు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదివాసీలు తమకు భూమి లేదని, నీళ్లు రావడం లేదని, ఇళ్లు లేవని, రేషన్‌కార్డులు వస్తలేవని, ఉద్యోగాలు లేవని, ఇలా తమ గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై ఆయన అప్పట్లో స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని చెప్పారు. అంతే కాకుండా పోడు భూముల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేలా తోడ్పాటు అందిస్తామని, అలాగే కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గత మార్చి 16న భట్టి పాదయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పిప్రి గ్రామంలో సభ నిర్వహించాలని భావించినప్పటికీ చివరిలో అది రద్దయింది.

నేడు ఉట్నూర్‌లో రైతు భరోసాపై వర్క్‌షాప్..

రాష్ట్రంలో రైతు భరోసా పథకం అమలుపై విధివిధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను సభ్యులుగా నియమించింది. వీరు ఉమ్మడి జిల్లా వారీగా వర్క్‌షాప్ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. బుధవారం తొలి సమావేశం ఖమ్మంలో చేపట్టారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఉట్నూర్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 10:20 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉట్నూర్ చేరుకుంటారు. 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు భరోసా పథకంపై కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న రైతు భరోసా వర్క్‌షాప్‌కు మంత్రివర్గ ఉపసంఘంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రైతులు పాల్గొనున్నారు. ఈ మేరకు కేబీ ప్రాంగణంలోని హెలిప్యాడ్, సమావేశ మందిరాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు పరిశీలించారు. వారి వెంట అదనపు ఎస్పీ సురేందర్‌రావు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ నాగేందర్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఇతర శాఖల అధికారులున్నారు.

సాగుభూములకే 'రైతు భరోసా'!

- మెజార్టీ రైతుల అభిప్రాయం
- జిల్లాలో పూర్తయిన సర్వే
- పాల్గొన్న వారు 1030 మంది



నెల్కివెంకటాపూర్‌లో పాల్గొన్న రైతులు(ఫైల్)

దండేపల్లి: రైతులకు పెట్టుబడి సాయంగా గత ప్రభుత్వం రైతుబంధు పథకం పేరిట వానాకాలం, యాసంగి సీజన్లలో కలిపి ఎకరాకు రూ.10వేల చొప్పున అందించింది. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రెండు సీజన్లలో కలిపి 'రైతు భరోసా' పేరిట ఎకరాకు రూ.15వేల చొప్పున అందిస్తామని ప్రకటించింది. ఈ పథకాన్ని ప్రస్తుత వానాకాలం నుంచే అమలుకు సన్నాహాలు చేస్తోంది. అందుకు సంబంధించిన విధివిధానాల ఖరారుకు నేరుగా రైతుల నుంచే అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని చేపట్టింది. సహకార సంఘాల సహకారంతో గత నెల 29నుంచి జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించింది. అర్హులకు మాత్రమే రైతు భరోసా అందించాలనే లక్ష్యంతో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించింది. జిల్లా వ్యాప్తంగా 20 సహకార సంఘాలు, సహకార, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇందులో 1030మంది రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వీరిలో ఎక్కువ శాతం మంది సాగుభూములు, ఐదెకరాల్లోపు వారికి మాత్రమే రైతు భరోసా అమలు చేయాలని ప్రతిపాదించారు. పదెకరాలు, 25 ఎకరాలకు ఇవ్వాలనీ మరికొందరు అభిప్రాయపడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతుల అభిప్రాయ సేకరణకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో గురువారం సమావేశం నిర్వహించనున్నారు.

జిల్లా రైతుల అభిప్రాయాలు ఇలా..

ఐదెకరాల్లోపు వారికే ఇవ్వాలి	487
పదెకరాల్లోపు వారికి ఇవ్వాలి	362
సాగుభూములకే ఇవ్వాలి	617
ఎంత భూమి ఉంటే అంతభూమికి	017
మద్దతు ధర, రాయితీపై ఎరువులు, విత్తనాలు	049

పూర్తయిన అభిప్రాయ సేకరణ

రైతు భరోసా పథకం అమలుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సహకార సంఘాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించాం. రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించాం. నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తాం.

– రామ్మోహన్, డీసీవో, మంచిర్యాల

ఇద్దరు టీచర్లకు షోకాజ్ నోటీసులు

మంచిర్యాలఅర్బన్: బదిలీల్లో స్పౌజ్ పాయింట్లు దుర్వినియోగం చేసిన టీచర్లపై విద్యాశాఖ కొరడా ఝళిపించింది. నిబంధనలకు విరుద్ధంగా నచ్చిన పాఠశాలలకు వెళ్లిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఉపాధ్యాయుల దరఖాస్తుల పరిశీలన మండల స్థాయిలో జరగకపోవడం, నిజనిర్ధారణకు సమయం లేకపోవడంతో ఆన్‌లైన్‌ను అనుకూలంగా మలుచుకుని నచ్చిన పాఠశాలలో చేరిపోయారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేరడంతో డీఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రెండ్రోజుల నుంచి స్పౌజ్ పాయింట్లను వినియోగించుకుని భర్త, భార్య చేసే ఒకే పోస్టింగ్, దరఖాస్తు చేయకుండా పక్క మండలాల్లో చేరిన టీచర్లను జాబితాను వడపోశారు. క్షేత్రస్థాయి నుంచి ఎంఈవోలు స్పౌజ్ బదిలీల పత్రాలను పరిశీలించారు. చివరికి తప్పుడు మార్గంలో బదిలీ అయిన ఇద్దరు టీచర్లకు నోటీసు జారీ చేశారు. హాజీపూర్ మండలం నుంచి భర్త పని చేసే కాసిపేటకు కాకుండా ప్రస్తుతం పని చేసే మండలంలోనే పాఠశాలకు ఆప్షన్ ఇచ్చిన ఆదిలక్ష్మి, జన్నారం మండలంలో విధులు నిర్వర్తించే సంతోష్ దండేపల్లికి కాకుండా కాసిపేట మండలానికి తప్పుడు ఆప్షన్ ఇవ్వడంతో డీఈవో యాదయ్య నోటీసులు జారీ చేశారు. కాగా, బుధవారం స్పౌజ్ టీచర్ల వెబ్ ఆప్షన్ పత్రాల పరిశీలన సందర్భంగా అవగాహన లేక ఆప్షన్ ఇచ్చాం మన్నించాలంటూ టీచర్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో ఎంఈఓల పరిధిలో ఎడిట్ ఆప్షన్ మాదిరిగా ఉంటుందని భావించామని, ప్రస్తుతం అర్ధరాత్రి వెబ్‌ఆప్షన్ ఇవ్వడం, ఫ్రీజ్ టైం అయిపోవడంతో ఏమీ చేయలేకపోయామని అధికారులకు విన్నవించినట్లు తెలుస్తోంది.

మొక్కలతోనే మానవ మనుగడ




మొక్కలు నాటుతున్న అధికారులు, విద్యార్థులు

బెల్లంపల్లిరూరల్: మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యపడుతుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. బుధవారం బెల్లంపల్లి రేంజ్ పరిధి పాతబెల్లంపల్లిలోని నీలగిరి ప్లాంటేషన్‌లో అటవీ శాఖ బెల్లంపల్లి రేంజ్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని విద్యార్థులతో కలిసి శ్రావణి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, అడవుల పెంపకం వల్ల పుష్కలంగా వర్షాలు కురిసి సంవృద్ధిగా పంటలు పండుతాయని తెలిపారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ వి.సునీత, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్లు గోగు సురేష్‌కుమార్, ఈ.లక్ష్మణ్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జె.నరేష్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు శ్రీరామ్‌ప్రసాద్, రమేష్, ఫీల్డ్ సూపర్‌వైజర్ తిరుపతి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

డేంజర్‌లో డయాలసిస్ సెంటర్!



మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రం



స్లాబ్ నుంచి పెచ్చులూడి సీలింగ్ మీద పడడంతో కిందికి వంగిన దృశ్యం

- పెచ్చులూడుతున్న స్లాబ్
- వర్షాలు కురిస్తే మరింత ప్రమాదం
- ఆందోళన చెందుతున్న వ్యాధిగ్రస్తులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో పది బెడ్‌లతో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. స్లాబ్ పెచ్చులు ఊడుతోంది. భవనం పాతది కావడం, వర్షాలు కురుస్తుండడంతో స్లాబ్ తడిసి పెచ్చులు కొద్దికొద్దిగా ఊడి సీలింగ్‌పై పడుతున్నాయి. ప్రస్తుతానికి ప్రమాదం ఏమీ లేకపోయినా, భారీ వర్షాలు కురిస్తే భవనం స్లాబ్ పెచ్చులు భారీగా పడితే, డయాలసిస్ చేసుకుంటున్న రోగులపై అవి పడే ప్రమాదం ఉంది.


రోజూ 30 మందికి..

మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 10 బెడ్‌లతో కూడిన డయాలసిస్ కేంద్రంలో నిత్యం 30 మందికి డయాలసిస్ చేస్తున్నారు. నెలలో 900 మందికిపైగా డయాలసిస్‌ను ఈ కేంద్రం ద్వారానే చేసుకోవడంతో నిత్యం ఈ కేంద్రంలోని 10 బెడ్‌లలో వ్యాధిగ్రస్తులు రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. స్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయం భయంగా డయాలసిస్ చేయించుకుంటున్నారు.

మరోచోటికి మారిస్తేనే..

ప్రస్తుతం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి భవనం కూడా పాతది కావడంతో ఏటా వర్షాకాలంలో స్లాబ్ పెచ్చులు ఊడి పడినచోట నుంచి వర్షపు నీరు స్లాబ్ నుంచి కిందకు కారుతుంది. దీంతో వైద్యం అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. రోగులు వర్షాకాలంలో భయం భయంగానే చికిత్స పొందుతున్నారు. ఇక డయాలసిస్ కేంద్రాన్ని ఆసుపత్రి ఆవరణలోనే ఉన్న మరో భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలావస్థకు చేరి, స్లాబ్ పెచ్చులు ఊడుతుండగా, ప్రమాదం జరగక ముందే డయాలసిస్ కేంద్రాన్ని మరో చోటుకు మార్చాలి. మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్వహిస్తున్న ఆవరణలోనే నూతన ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను చేపడుతున్నారు. 450 పడకలతో నిర్మిస్తున్న ఈ భవనం పూర్తి కావాలంటే ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. ప్రైవేటు సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రం నిర్వహించేందుకు అనుకూలంగా ఉండే ఏదైనా ప్రైవేటు భవనంలోకి మార్చాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయి



డయాలసిస్ కేంద్రం నిర్వహిస్తున్న భవనం పాతది కావడంతో, వర్షాలు కురిసినప్పుడు తేమకు స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయి. ప్రతీరోజు 30 మంది వరకు డయాలసిస్‌ను చేసుకునేందుకు వస్తుంటారు. 10 బెడ్‌లలో రోగులు నిత్యం ఉంటారు. స్లాబ్ పెచ్చులు పడుతుండడంతో మరో భవనంలోకి డయాలసిస్ కేంద్రం మార్చాలని అధికారులకు చెప్పాం. ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం నిర్వహించేందుకు సరిపడా గదులు లేవు. నూతనంగా నిర్మిస్తున్న భవనం పూర్తయితే, అందులోకి మార్చేందుకు అవకాశం ఉంది. అప్పటి వరకు ప్రైవేటు భవనంలోకి తరలించేలా అధికారులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటాం.

– డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్

రైతుల హామీలు అమలు చేయాలి



రైతు సత్యాగ్రహ నిరసనలో రఘునాథ్, నాయకులు

దండేపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం రైతు సత్యాగ్రహ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేలు వంటి హామీలు ఇచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి సారించి, సాగు నీరందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు ప్రభాకర్, శేఖర్, రవిగౌడ్, గురువయ్య, సురేందర్, కిషన్, రాకేష్, శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, దివ్య, నర్సింగ్, సురేష్, వెంకటేష్, నరేష్, విజేందర్, అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగులపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో సంద్ర ధర్మయ్య (42)అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అందుగులపేటకు చెందిన ధర్మయ్య పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది.

మృతదేహాన్ని ఢీకొట్టి..

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బత్తుల శ్రీకాంత్ రోడ్డుపై పడి ఉన్న ధర్మయ్య మృతదేహాన్ని ఢీకొట్టి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన రాంటెంకి శ్రీకాంత్ (24) బుధవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నాలుగేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన మౌనికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాదికే భార్య మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ పైనుంచి పడి ఒకరి మృతి


దండేపల్లి: మండల కేంద్రంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన ఎడ్ల శంకరయ్య (74)కు గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య రాంపూర్ గ్రామానికి చెందిన రాకేష్‌తో కలిసి మంగళవారం పని నిమిత్తం బైక్‌పై లక్సెట్టిపేటకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా తాళ్లపేట పీహెచ్‌సీ సమీపంలో బైక్‌కు అడ్డువచ్చిన పందిని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. శంకరయ్య తలకు బలమైన గాయం కావడంతో 108లో లక్సెట్టిపేట ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని


చికిత్స పొందుతున్న విద్యార్థిని

నస్పూర్: హాస్టల్‌లో చేర్పించిన తండ్రి ఇంటికి తీసుకెళ్లలేదని, ఎలాగైనా ఇంటికి వెళ్లాలన్న ఆత్రుతలో ఓ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కిందికి దూకి గాయాలపాలైన సంఘటన నస్పూర్‌లో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో ఉంటున్న అల్వాల లక్ష్మణ్ కుమార్తె అక్షరను ఇటీవల నస్పూర్‌లోని కేజీబీవీలో ఆరోతరగతిలో జాయిన్ చేశారు. తండ్రి లక్ష్మణ్ మంగళవారం కూతుర్ని చూడడానికి హాస్టల్‌కు వెళ్లాడు. తనకు ఇంటిపై బెంగగా ఉందని, ఇంటికి తీసుకెళ్లమని కోరింది. ఇందుకు తండ్రి నిరాకరించాడు. దీంతో బుధవారం ఉదయం స్నానం చేసేందుకు వెళ్లి హాస్టల్ రెండవ అంతస్తు నుండి దూకి బయటకు వెళ్లే ప్రయత్నం చేసింది. గమనించిన హాస్టల్ సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని వెన్నుముకకు గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.





ప్రభంజనం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విశాలమైన గృహాలు, భవంతుల్లో కుటుంబ సభ్యులు నివాసముండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోతున్నాయి. క్రమంగా పట్టణీకరణ పెరుగుతుండడంతో పట్టణాలు, నగరాల్లో ఇరుకు గదుల్లో, సరైన వసతులు లేని నివాసగృహాల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇక పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు చెప్పనక్కర్లేదు. దీనికంతటికీ కారణం నానాటికీ పెరుగుతున్న జనాభా. భూమిపై పరిమితంగా ఉన్న సహజ వనరులు వినియోగించుకుంటూ అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాకు ఆహారం నివాసం కల్పించుకోవడం కష్టతరమవుతోంది. దీనికి తోడు వ్యవసాయ భూములు సైతం నివాస సముదాయాలుగా మారుతున్నాయి. అటవీ విస్తీర్ణం కూడా క్రమంగా తగ్గుతోంది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరమవుతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికంతటికీ పరిష్కారమార్గం అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టడమే. 1987 జూలై 11న ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా జూలై 11న 'ప్రపంచ జనాభా దినోత్సవం' జరుపుకుంటున్నాం.

- మితిమీరితే అనర్థమే..
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా
- ఉమ్మడి జిల్లాలోనూ 30 లక్షలకు చేరువగా..
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై..వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి.

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి సంస్థ విడుదల చేసిన 2021 గణాంకాల ప్రకారం..

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ)	జనసాంద్రత (కి.మీ)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115

మితిమీరితే ఏర్పడే సమస్యలు

- జనాభా పెరుగుదలతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- అడవులు అంతరించిపోతాయి.
- జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. నిరుద్యోగం పెనుసమస్యగా పరిణమిస్తుంది.
- ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బంది పెడతాయి.
- భవిష్యత్ అవసరాలకు ఆటంకంగా మారుతుంది.
- జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి.

సహజ వనరుల్ని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం, నిరక్షరాస్యత, అవసరాలు తీరకపోవడం, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్నంగా అవగాహన కల్పించి స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారమవుతాం.

ప్రభుత్వాలు ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా..

జనాభా పెరుగుదల నియంత్రించాలని ప్రభుత్వాలు అనేక ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా సరైన ప్రతిస్పందన కనిపించడం లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జనాభా నియంత్రణ అనేది స్వీయ ఆచరణ నుండి రావాలని ఒక మతం, ఒక వర్గం నుండే కాకుండా అందరూ ఆచరణలో అమలు చేయాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు మానవ వనరులను పెంచుకుంటూపోతే ప్రపంచీకరణలో భాగంగా ఎక్కడైనా మనుగడ సాగించగలుగుతాడని.. ప్రభుత్వాలు, పాలకులు చేయాల్సింది మౌలిక సదుపాయాలు కల్పించడమేనని మరోవైపు వాదిస్తున్నారు.

పెరుగుతున్న నిరుద్యోగం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 లక్షలకు పైగా జనాభా ఉండగా ఇందులో 60 శాతానికిపైగా యువత, వయోజనులే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ చిన్న ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో విపరీతమైన పోటీ నెలకొంటోంది. ప్రైవేటు రంగంలోనూ విపరీతమైన పోటీ ఉంటోంది. చిన్నాచితకా ఉద్యోగాలకు కూడా వందల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై వేలసంఖ్యలో యువత గల్ఫ్ దేశాలకు పయనమవుతూ వలస కార్మికులుగా మారుతున్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం పెరుగుతున్న జనాభా అని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జనాభా పెరుగుదల వల్ల నివాస సముదాయాలు పెరిగిపోవడం రియల్ ఎస్టేట్ రంగం కూడా వ్యాప్తి చెందుతుంది. క్రమంగా అటవీ విస్తీర్ణం కూడా తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

చదరపు కిలోమీటర్‌కు సగటున 175 మంది...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 16,101.98 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిఉండగా 2021 జనాభా లెక్కల ప్రకారం 27,41,239 మంది జనాభా ఉన్నారు. ఈ లెక్కన ఒక చదరపు కిలోమీటర్‌కు జనసాంద్రత 175 నమోదై ఉంది. నిర్మల్ జిల్లాలో 7,09,000, ఆదిలాబాద్ జిల్లాలో 7,08,000, మంచిర్యాల జిల్లాలో 8,07,000, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5,15,000కు పైగా జనాభా నివసిస్తున్నారు. మంచిర్యాల జిల్లా అత్యధికంగా ఒక చదరపు కిలోమీటర్‌కు 207, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యల్పంగా 115 మంది జనసాంద్రతను కలిగి ఉన్నాయి.

నియంత్రణ అవసరం



పరిమిత వనరులున్న మనదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు.. ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.
– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

గల్ఫ్‌బాటలో యువత..



ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న జనాభా దృష్ట్యా నిరుద్యోగ రేటు కూడా పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 50 వేలకు పైగా మంది గల్ఫ్ దేశాల్లో కుటుంబాలకు దూరంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇక్కడి మానవ వనరులను సరైన విధంగా వినియోగించుకునే మార్గాలను మన ప్రభుత్వాలు అన్వేషిస్తేనే వలసలు ఆగుతాయి.– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ సంఘాల నాయకుడు, నిర్మల్

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,78,030 నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో సంబంధిత వివరాలు వెల్లడించారు.. తమకు అందిన సమాచారం మేరకు స్థానిక స్వాగత్ ఫ్రైడ్ రెస్టారెంట్‌పై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న స్థానిక గౌతమి నగర్‌కు చెందిన పోటు మాధవరెడ్డి, కంది దామోదర్‌రెడ్డి, సిరికొండ కొండల్‌రావ్, గంగవరపు వెంకటేశ్వర్లు, రాంనగర్‌కు చెందిన గుర్రం జనకరెడ్డి, మారుతి నగర్‌కు చెందిన పల్లపు తిరుపతి, రెడ్డి కాలనీకి చెందిన గుండు శ్రీధర్, ఎస్.శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన అల్లం సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారంతా జిల్లా కేంద్రంలోని ప్రముఖులు కావడం చర్చనీయాంశంగా మారింది.

బాధ్యతలు స్వీకరించిన జనక్‌ప్రసాద్


జనక్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నేతలు

శ్రీరాంపూర్: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో లేబర్ కమిషనర్ ఆదిత్య చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీరాంపూర్ నుంచి పలువురు ఐఎన్టీయూసీ నేతలు హాజరై జనక్‌ప్రసాద్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, బ్రాంచి నాయకులు ల్యాగల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంగళ కుమారస్వామి, నర్సింగ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగి రక్షణపై శ్రద్ధ చూపాలి


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి తన రక్షణపై శ్రద్ధపెట్టి పనిచేయాలని కార్పొరేట్ జీఎం(సేఫ్టీ) కే గురువయ్య తెలిపారు. బుధవారం ఆర్కే 5 గనిపై ఆయన ఉద్యోగులతో రక్షణపై మాట్లాడారు. రక్షణ నియమాలు పాటిస్తూ పని చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో రక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. పని ప్రదేశాల్లో ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత రక్షణతో పాటు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న ఆయన్ను ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూజీఎం గోపాల్ సింగ్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, పిట్ సెక్రెటరీ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ దీక్షలు కొనసాగింపు


కండువా వేస్తున్న వాసిరెడ్డి సీతారామయ్య

మందమర్రిరూరల్: తెలంగాణలోని నూతన బొగ్గు గనులను వేలం లేకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి మూడోరోజుకు చేరుకున్నాయి. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య దీక్షా శిబిరాన్ని సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి వేలం లేకుండా సింగరేణికి కేటాయించేంత వరకు ఆందోళనలు విరమించేది లేదని హెచ్చరించారు.

మూడోరోజుకు చేరిన దీక్షలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడోరోజుకు చేరుకున్నాయి. బుధవారం ఈ దీక్షలను ఏఐటీయూసీ అధ్యక్షుడు వీ.సీతారామయ్య ప్రారంభించారు. సింగరేణి భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లకుండా ఉండాలంటే కొత్త గనులు రావాల్సి ఉందన్నారు. సింగరేణికి గనులు కేటాయించడం కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, నాయకులు మల్లేశ్, మారుపల్లి సారయ్య, బద్రి బుచ్చయ్య, నర్సింగరావు, ఎడ్ల సమ్మయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు జీరో అకౌంట్ తెరవాలి


మాట్లాడుతున్న బ్రహ్మానందం

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బీమా పొందడానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో జీరో అకౌంట్ ఖాతాలు తెరవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం సూచించారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో, ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే బాధిత కుటుంబానికి రూ.20 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. డెబిట్ కార్డు కలిగి ఉంటే 6 నెలలకోసారి స్వైపింగ్ చేసి ఉంటే అదనంగా మరో రూ.10 లక్షలు వస్తాయన్నారు. ఇంకా ఇతర సదుపాయాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పారావు, జీ.శంకర్, వెంకన్న, శ్రీను, రాజేశ్, రాంబాబు, రాము, ఎల్లయ్య, కవిత, తదితరులు పాల్గొన్నారు.

కైరిగూడ ఓసీపీ సమీపంలో 'వనమహోత్సవం

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ సమీపంలో బుధవారం ఓసీపీ అధికారులు వనమహోత్సవం నిర్వహించారు. ఓసీపీ చెక్‌పోస్టు సమీపంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ మొక్కలు నాటారు. చెక్‌పోస్టు నుంచి గోలేటికి వెళ్లే దారిలో రోడ్డుకిరుపులా భారీగా మొక్కలు నాటారు. పీవో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వన మహోత్సవం కార్యక్రమానికి ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం


పంచనామా చేస్తున్న ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ములక్కల్ల గ్రామానికి చెందిన కోల శరత్‌కుమార్ (33)కు పది నెలల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషుల మధ్య విడాకులు తీసుకున్నాడు. తరచూ పంచాయితీలు జరగడం, తల్లిదండ్రులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లిలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎల్కపల్లికి చెందిన తెలిగె రాజన్న (42)కు ఇరవై ఏళ్ల క్రితం దహెగాం మండలంలోని ఐనం గ్రామానికి చెందిన మంగతో వివాహమైంది. కుటుంబ కలహాలతో పదిహేనేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా మృతుడు ఇంటి నుంచి బయటికి రాకపోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలుపులు తెరచి చూడగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించింది. మృతుని కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య పేర్కొన్నారు.

ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడిగా రాంకుమార్

మంచిర్యాలటౌన్: ఆటో యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కట్ట రాంకుమార్‌ను ఎన్నుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. తమ యూనియన్ పార్టీలకు అతీతంగా పనిచేస్తుందని, ఆటో డ్రైవర్ల సమస్యలపై ఉద్యమించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఉపాధ్యాయుని వెంట విద్యార్థులు రావడం అభినందనీయం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రఘునాథ్ వెరబెల్లి

జన్నారం: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుని వెంట విద్యార్థులు రావడం అభినందనీయమని, ఇలాంటి ఉపాధ్యాయుడు సమాజానికి ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఇటీవల జన్నారం మండలం అక్కపెల్లి గూడకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు జాజల శ్రీనివాస్ వెంట ఆ పాఠశాల నుంచి 141 మంది విద్యార్థులు వెళ్లిన విషయం తెలుసుకుని బుధవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయున్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందని చెప్పడానికి శ్రీనివాస్ ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు కొంతం శంకరయ్య, గోలి చందు, ప్రవీణ్‌కుమార్, బెడద గోపాల్, సూర్యం, రమేశ్‌గౌడ్, చిట్టిబాబు, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల సన్మానం

ఉపాధ్యాయుడు జాజల శ్రీనివాస్‌ను బుధవారం జన్నారం మండల బీసీ సంఘాల నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల హృదయాల్లో నమ్మకం ఏర్పర్చుకున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కొడూరి చంద్రయ్య, నర్సింహులు, లక్ష్మీనారాయణ, నర్సయ్య, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదకు ల్యాప్‌టాప్ విరాళం


ల్యాప్‌టాప్ అందజేస్తున్న అమర్‌నాథ్ రెడ్డి

జన్నారం: ప్రతిభకు పేదరికం అడ్డురాకూడదని, నిరుపేద ప్రతిభావంతునికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందజేశారు. జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి అశ్విన్‌కుమార్ తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే మృతి చెందారు. కుటుంబ సభ్యుల సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్శిటీలో ఎమ్మెస్సీలో అడ్మిషన్ పొందాడు. ల్యాప్‌టాప్ అవసరం కావడంతో భూగర్భ జల శాఖ ఉమ్మడి జిల్లా పర్యవేక్షకులుగా పనిచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న అమర్‌నాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఉమ్మడి జిల్లా ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో విషయాన్ని తెలియజేశాడు. ఉద్యోగుల సహాయంతో రూ. 64 వేల విలువైన ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి బుధవారం అందజేసినట్లు అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

లక్సెట్టిపేట: విద్యుత్ షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుల్లకోటకు చెందిన పనాస లక్ష్మి (52) బుధవారం ఇంటి సమీపంలో సాగుచేసిన కూరగాయల మొక్కల్లో కలుపు తీస్తుండగా పక్కనే ఉన్న ఇనుప కంచె (ఫెన్సింగ్) కు విద్యుత్ షాకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థలం పక్కనే ఉన్న నర్సరీకి మోటర్ కోసం విద్యుత్ స్తంభం నుంచి సర్వీస్ వైర్ తీసుకున్నారు. ఫెన్సింగ్ వైర్ తాకుతుండటంతో విద్యుత్ వైర్ చెడిపోయి కరెంట్ సప్లై కావడంతో మృతి చెందినట్లుగా తెలిపారు. కొంత కాలంగా నర్సరీకి సంబంధించిన భూమి వారితో మృతురాలికి గొడవలు జరిగాయి. అప్పటి నుండి వ్యవసాయ భూమికి చెందిన అంజన్న, సత్యనారాయణ, నర్సరీ నిర్వహించే చిలుకయ్య వారిని చంపుతామని బెదిరించినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీఐ నరేందర్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి కూతురు సౌందర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో ఏడాది జైలు

నెన్నెల: చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష రూ.200 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముఖేష్ బుధవారం తీర్పునిచ్చారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. 2022 జులై 7న మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ సాయిబాబా ఆలయంలోని హుండీ ఎత్తుకెళ్లి నగదు దోచుకున్నాడని పూజారి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పోలీసులు కోర్టులో సాక్షాదారాలు ప్రవేశపెట్టగా అదనపు పీపీ అజయ్‌కుమార్ వాదించి నేరనిరూపన చేయడంతో ఈమేరకు శిక్ష ఖరారు చేశారని ఎస్సై వివరించారు.